# సాక్షి
## పశ్చిమగోదావరి

మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024




**శ్రీవారి ట్రస్ట్‌కు విరాళం**

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన భక్తుడు చింతా శ్రీరామచంద్రమూర్తి సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు.



**దూసుకొచ్చిన మృత్యువు**

ఆకివీడులో ఓ వ్యాన్ అదుపుతప్పి విధ్వంసం సృష్టించింది. విద్యుత్ స్తంభం, వాహనాలను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ మోటార్ సైక్లిస్టు మృతి చెందాడు. 8లో ▸



**ఇద్దరు చిన్నారుల మృతి**

పైడిచింతపాడులో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ ఇంటి ఎదురుగా ఉన్న చేపల చెరువులో పడి మృతి చెందారు. 8లో ▸

## న్యూస్‌రీల్

### ఆదరించిన నాయకునిపైనే అభాండాలా?

**జంగాపై ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఫైర్**



కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

సాక్షి, భీమవరం: అక్కున చేర్చుకుని ఆదరించిన నాయకుని పైనే అన్యాయంగా అభాండాలు వేస్తారా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో పదేళ్ల పాటు పదవులు అనుభవించి, ఇప్పుడు దుష్ప్రచారం చేస్తారా అని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిపై ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మండిపడ్డారు. ప్రభుత్వంపై ఎమ్మెల్సీ జంగా ఆరోపణలను ఖండిస్తూ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఎమ్మెల్సీ శ్రీనివాస్ ఆయనపై పలు ప్రశ్నలు సంధించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో గురజాల నియోజకవర్గంలో మీరు ఓడిపోయినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు వరకు అండగా ఉండి అన్ని విధాలా ఆదుకున్న విషయాన్ని మర్చిపోయారని మండిపడ్డారు. 2019 ఎన్నికల్లో మీరు గెలిచే అవకాశం లేకనే కాసు మహేష్‌రెడ్డికి పార్టీ టికెట్ ఇవ్వడం వాస్తవమే కాదన్నారు. ఎమ్మెల్సీ పదవి, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షునిగా, శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా సముచిత స్థానం కల్పించి గౌరవించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పదేళ్లుగా పదవులు అనుభవించి, కేవలం టికెట్ ఇవ్వలేదన్న అక్కసుతో బీసీలను అణిచివేస్తున్నారంటూ సీఎం జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేయడానికి సిగ్గు లేదా అని నిలదీశారు. రాజకీయ దురుద్దేశంతో దిగజారుడు ప్రకటనలు మానుకోవాలని ఎమ్మెల్సీ జంగాకు ఆయన హితవు పలికారు.

### బ్రాంచ్ లైన్‌లో పట్టాల పటిష్టతకు చర్యలు



విజయవాడ-భీమవరం మధ్య కొత్త రైలు పట్టాల ఏర్పాటుకు ఆకివీడు చేరుకున్న పట్టాలు

ఆకివీడు: బ్రాంచ్ రైల్వే లైన్ ఆధునికీకరణలో భాగంగా కొత్త రైలు పట్టాల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. విజయవాడ నుంచి భీమవరం వరకూ పాత పట్టాల్ని తొలగించి కొత్త పట్టాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో కొత్త పట్టాల్ని దిగుమతి చేశారు. రైల్వే ప్రయాణానికి అంతరాయం కల్గకుండా ఆయా స్టేషన్ల మధ్య కొత్త పట్టాల్ని ఏర్పాటు చేస్తున్నారు. విజయవాడ-నర్సాపురం, నిడదవోలు బ్రాంచి లైన్ల ఆధునికీకరణ, డబల్ లైన్, విద్యుద్దీకరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. గత 50 ఏళ్ల క్రితం నిర్మించిన పాత రైల్వే పట్టాల్ని తొలగించి, కొత్త పట్టాలు ఏర్పాటు చేస్తారు. రానున్న రోజుల్లో బ్రాంచ్ లైన్‌లో మరిన్ని గూడ్స్ వ్యాగన్ల రవాణాను పెంచేందుకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. అత్యధిక బరువుతో డబల్ వ్యాగన్లను నడుపుతుండటం వల్ల పట్టాలు విరిగిపోయే ప్రమాదం ఉన్నదని భావించి కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ అధికారి వివరించారు.

### 20న ఐటీఐ అప్రెంటీస్ మేళా

ఉండి: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తణుకు ఆంధ్రా షుగర్స్ క్యాంపస్‌లో ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించే అప్రెంటీస్ మేళాకు హాజరుకావాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నేరుగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో మేళాకు హాజరై అప్రెంటీస్ అవకాశాన్ని పొందాలన్నారు. మరిన్ని వివరాలకు ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రధానాధికారి లేదా జూనియర్ అప్రెంటీస్ అధికారిని 96760 99988 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### రేపు కొవ్వలిలో సైన్స్ ఫెయిర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం దెందులూరు మండలం కొవ్వలి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి జిల్లా నుంచి మొత్తం 126 మంది విద్యార్థుల ప్రాజెక్టులు ఈ ప్రదర్శనకు ఎంపికయ్యాయని, వారికి ఒక్కొక్క ప్రాజెక్టుకు రూ.10 వేల చొప్పున విడుదల చేశారన్నారు. జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపికైన ప్రాజెక్టులతో పాటు విద్యార్థులు తమ గైడ్ టీచర్లతో ఉదయం 8 గంటలకు తప్పక హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు తమ ప్రాజెక్టు రైటప్, పాస్‌పోర్టు ఫొటోలతో బయోడేటా, వారంట్‌లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి సీహెచ్‌ఆర్‌ఎం చౌదరిని 94407 12412 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# ప్రతిభకు పదును

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి సాంకేతిక పరిజ్ఞానంపై వారిలో ఆసక్తిని పెంపొందించే దిశగా ఇన్‌స్పైర్ మనక్ జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు జిల్లా సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. 14వ తేదీన ఏలూరు జిల్లా దెందులూరు మండలం కొవ్వలిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి 126 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించనున్నారు.

- విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకే 'ఇన్‌స్పైర్ మనక్'
- రేపు కొవ్వలిలో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి
- కోవిడ్ వల్ల 2020 సంవత్సరంలో నిలిచిన వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహణ
- విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు వైఎస్ జగన్ సర్కారు చర్యలు

సాక్షి, భీమవరం: విద్యార్థుల ఆలోచనలకు పదును పెడుతూ వినూత్న ఆవిష్కరణలకు రూపకల్పన చేసేందుకు వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏటా 6 నుంచి 10వ తరగతి వరకు ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇన్‌స్పైర్ మనక్ పురస్కారాలను అందజేస్తోంది. కోవిడ్‌తో 2020 సంవత్సరంలో పోటీలు నిలిచిపోవడంతో ప్రస్తుతం 2022-23 విద్యా సంవత్సరానికి గాను పోటీలు జరుగనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్‌ఎఫ్‌ఐ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి ఆన్‌లైన్‌లో 2,400 నామినేషన్లు పంపించగా 126 నామినేషన్లు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించాయి. వీటిలో పశ్చిమగోదావరి జిల్లా నుంచి 53, ఏలూరు జిల్లా నుంచి 73 ఎంపికయ్యాయి. పర్యావరణ పరిరక్షణ, అధునాతన వ్యవసాయ విధానాలు, హెల్త్ న్యూట్రిషన్ తదితర ప్రాజెక్టులు ఉన్నాయి. ఎంపికైన నామినేషన్లకు సంబంధించి ప్రాజెక్టు రూపకల్పన, రవాణా ఖర్చుల నిమిత్తం విద్యార్థుల వ్యక్తిగత ఖాతాలకు గత ఏడాది జూన్ లోనే రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం జమ చేసింది.



సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించనున్న ఓ ప్రాజెక్టు

2022-23 సంవత్సరానికి ఉమ్మడి జిల్లా స్థాయిలో పంపిన నామినేషన్లు
**2400**

ఎంపికైనవి : **126**

| పశ్చిమగోదావరి జిల్లా నుంచి | ఏలూరు జిల్లా నుంచి |
|---|---|
| 53 | 73 |

రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక అయ్యే అవకాశం ఉన్న ప్రదర్శనలు **10** శాతం

### 14న పోటీల నిర్వహణ

జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఇన్‌స్పైర్ మనక్ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. ఈ మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు మండలం కొవ్వలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎక్స్‌పో నిర్వహణకు జిల్లా సైన్స్ కాంగ్రెస్ సన్నాహాలు చేస్తోంది. రెండు జిల్లాల నుంచి 126 ప్రాజెక్టులను విద్యార్థులు ఈ పోటీల్లో ప్రదర్శిస్తారు. విద్యార్థులు తమ ప్రాజెక్టులు, గైడ్ టీచర్లతో ఉదయం 8 గంటల సమయానికి వైజ్ఞానిక ప్రదర్శన ప్రాంగణానికి చేరుకోవాల్సి ఉంటుంది. ప్రాజెక్టు రైటప్, పాస్‌పోర్టు ఫొటో, వారెంట్‌తో హాజరుకావాలని జిల్లా సైన్స్ అధికారులు తెలిపారు. ఇన్‌స్పైర్ మనక్ కమిటీ సభ్యులు దగ్గరుండి పోటీలను పర్యవేక్షిస్తారు. ఎన్‌ఎఫ్‌ఐ, ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన ప్రతినిధులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారు. ప్రతిభావంతమైన పది శాతం ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. వీరు త్వరలో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన ప్రాజెక్టులు జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధిస్తాయి. జిల్లా స్థాయి పోటీలు విజయవంతం నిర్వహించేందుకు ఇన్విటేషన్, రిసీవింగ్, మీల్స్, డిసిప్లేన్, జడ్జిమెంట్ తదితర విభాగాలుగా ఉపాధ్యాయులతో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు.

### ప్రదర్శనలు ఆకట్టుకుంటాయి



ఇన్‌స్పైర్ జిల్లాస్థాయి పోటీలు ఏలూరు కొవ్వలిలో నిర్వహించేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఆయా పాఠశాలలకు సమాచారం ఇవ్వడం జరిగింది. ఎంపికైన ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థితో పాటు గైడ్ టీచర్ హాజరు కావాలి. ఇన్‌స్పైర్ మనాక్‌లో విద్యార్థులు ప్రదర్శించే ప్రాజెక్టులు ఎంతో ఆకట్టుకుంటాయి. కేంద్రం బృందం సభ్యులు దగ్గరుండి పోటీలను పర్యవేక్షిస్తారు.

– వీఎంజెడ్ శ్యాంప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి, భీమవరం

### సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలి

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష

భీమవరం (ప్రకాశం చౌక్): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నోడల్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో ఎన్నికల నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఓ, ఏపీఓ, సహాయ సిబ్బంది వివరాలను ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయడానికి డీడీవోలు బాధ్యత వహించాలని ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వహణలో ఏ ఒక్కరికి మినహాయింపు ఉండదన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే పోలింగ్ అధికారులకు, సిబ్బందికి త్వరలో పోలింగ్ ప్రక్రియపై వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు. మొదటి దఫాలో ఆర్‌ఓలకు, రెండోసారి ఈఆర్‌ఓలకు, మూడోసారి ఏఈఆర్‌ఓలకు అవగాహన కల్పిస్తామన్నారు. స్ట్రాంగ్‌రూమ్, ట్రాన్సిట్ స్ట్రాంగ్ రూమ్‌ల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఎన్నికల పరిశీలకులు అడిగే సమాచారాన్ని అందజేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. నోడల్ అధికారులు వారికి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. వారం రోజుల్లో డెటాబెస్, ట్రైనింగ్ పూర్తి చేసే బాధ్యత ఆయా డీడీవోలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవోలకు కోడ్ ఆఫ్ కండక్ట్‌పై ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు. ఇన్‌చార్జి డీఆర్వో బి.శివనారాయణ రెడ్డి, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, డీపీఆర్‌ఓ టి.నాగేశ్వరరావు, జేడీఏ జెడ్.వెంకటేశ్వర రావు, జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు, డ్వామా పీడీ ఎం.ప్రభాకరరావు పాల్గొన్నారు.

## ఓటు వేయడం ప్రతి పౌరుడి బాధ్యత




కలెక్టరేట్‌లో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు

భీమవరం (ప్రకాశం చౌక్): ఓటు వేయడం ప్రతి పౌరుడు బాధ్యతగా స్వీకరించాలని ఇన్‌చార్జి డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో స్వీప్ యాక్టివిటీలో భాగంగా స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజలు, అధికారులతో డీఆర్వో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు విలువైందని, ఓటు ప్రజాస్వామ్య పరిరక్షణకు మూలధారమని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఓటు నమోదు చేయించుకోవడం, పక్కవారితో కూడా నమోదు చేయించడం, ఓటు వేయడం ప్రతి పౌరుడు బాధ్యతన్నారు. స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న స్వీప్ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా వివిధ శాఖలు అధికారులు, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ శ్రీరంగసాయి, పిప్పళ్ల ప్రసాదు, షేక్ చాన్‌భాషా, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేటు సభ్యులు మేళం దుర్గాప్రసాదు పాల్గొన్నారు.

### నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహిస్తామని జిల్లా పరిషత్ సీఈఓ కె.సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లా పరిషత్ బడ్జెట్ సవరణ అంచనాలు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలపై చర్చ, వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షిస్తామని పేర్కొన్నారు.

## కవిటంలో ఘనంగా రుద్రహోమం

పోడూరు: కవిటంలో శ్రీ సహస్రచండీ సహిత మహాసౌర పూర్వక చతుర్వేద స్వాహాకార సహిత దశ మహావిద్యా పూర్వక అతిరుద్ర మహాయాగ మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం వేద పండితులు రుద్రహోమం, పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పెనుమంట్ర మండలం నెలమూరుకు చెందిన శ్రీ ఉమా రామలింగేశ్వర ట్రస్ట్, శర్వాణీ స్కూల్ ఆధ్వర్యంలో దాతలు, భక్తులు, గ్రామస్తుల సహకారంతో ఈ యాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, టీటీడీ సభ్యులు మేకా శేషుబాబు, సినీ హీరో శ్రీకాంత్ సతీమణి ఊహ, కుమారుడు రోషన్, అనుశ్రీ ఫిలింస్ అధినేత అనుశ్రీ సత్యనారాయణ, అనురాధాదేవి దంపతులు, యాగమహోత్సవం, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి కాణిపాకం శ్రీసిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిపారు. ఆధ్యాత్మికవేత్త జంధ్యాల శ్రీనివాసశర్మ (నెలమూరు శర్మ), కవిటం సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, గుడిమెట్ల రామకనకారెడ్డి, సత్తి మురళీకృష్ణారెడ్డి, సత్తి రామచంద్రారెడ్డి, గాదె శ్రీనివాసరావు, పడాల వెంకట సత్యనారాయణరెడ్డి, కర్రి రామిరెడ్డి, కర్రి గంగాధరరెడ్డి, బాలాజీరెడ్డి, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కవిటంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి కారుమూరి, టీటీడీ సభ్యులు మేకా శేషుబాబు



యాగంలో పాల్గొన్న హీరో శ్రీకాంత్ భార్య ఊహ, కుమారుడు రోషన్‌లతో నాయకులు

### శ్రీమావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ.63.98 లక్షలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. గత 33 రోజుల కాలంలో భక్తులు అమ్మవారికి హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.63,98,749 ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. అలాగే బంగారం 68 గ్రాముల 800 మిల్లీ గ్రాములు, వెండి 221 గ్రాములు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో తనిఖీదారు వి.వెంకటేశ్వరరావు, ఈవోలు కర్రి శ్రీనివాస్, ఎం.అరుణ్‌కుమార్, ధర్మకర్తలు, బ్యాంకు రెవెన్యూ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హుండీల కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

### స్పందన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలి

**జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల**



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ అజిత

నరసాపురం రూరల్ : స్పందనలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నరసాపురం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో జిల్లా పోలీస్ స్పందన కార్యక్రకమాన్ని ఆమె నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ అర్జీలను ఎస్పీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో 21 ఫిర్యాదులు వచ్చాయి. తన ఫేస్‌బుక్ ఖాతాను హ్యాక్‌చేసి అశ్లీల ఫోటోలు తన ఖాతాలో పోస్టుచేస్తున్నారని మొగల్తూరు మండలం పేరుపాలెం గ్రామానికి చెందిన కొడమంచిలి జీవరత్నం ఫిర్యాదు చేశారు. అలాగే భార్యాభర్తల తగాదాలు, కుటుంబ కలహాలు, చెక్కు బౌన్సుకేసులు, నిరాదరణకు గురైన వృద్ధురాలు, రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తికి సంబంధించిన కేసుకు సంబంధించి సెక్షన్ మార్చడం లేదంటూ ఇలా పలు ఫిర్యాదులు అందాయి. అర్జీలను స్వీకరించిన ఎస్పీ సమస్యల పరిష్కారానికి త్వరితగతిన కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వి భీమారావు, డీఎస్పీలు కె రవిమనోహరాచారి, వి నారాయణ స్వామిరెడ్డి, సీఐలు గోవిందరావు, అప్పలస్వామి, వెంకటేశ్వరరావు, ఎస్సైలు ప్రసాద్, గురవయ్య తదితరులు ఉన్నారు.

# బరితెగించిన టీడీపీ గూండాలు

- కొప్పాకలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై కత్తిపీట, రాడ్డులతో దాడి
- పలువురు నాయకులు, కార్యకర్తలకు తీవ్ర గాయాలు
- ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు, ఎమ్మెల్యే కొఠారు పరామర్శ
- ఇకపై సహించబోమని హెచ్చరించిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి: ఏలూరు జిల్లా పెదవేగి మండలం కొప్పాక గ్రామంలో టీడీపీ గూండాలు బరితెగించారు. కత్తిపీట, రాడ్డులతో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడికి తెగబడటంతో పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి స్పందిస్తూ టీడీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండించారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.



ఏలూరు జీజీహెచ్ వద్ద గొడవ చేసేందుకు ప్రయత్నిస్తున్న టీడీపీ వర్గీయులు



ఏలూరు ఆస్పత్రిలో నేతలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొఠారు

**అసలేం జరిగిందంటే..**

కొప్పాక గ్రామానికి చెందిన రంగు శబరీనాథ్ ఆరోగ్యశ్రీ ద్వారా తన తల్లికి రూ.8 లక్షల విలువైన చికిత్స జరగడంతో.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో తన షాపు ముందు జగనన్న పోస్టర్ పెట్టుకున్నాడు. దీంతో టీడీపీ శ్రేణులు శబరీనాథ్‌ను జగన్ పోస్టర్ తీసేయాలంటూ గత కొద్దిరోజులుగా బెదిరింపులు, వేధింపులకు పాల్పడుతున్నారు. అయినా అతను పోస్టర్ తొలగించలేదు. దీంతో కక్ష పెట్టుకుని పాత బకాయి సొమ్ము ఇవ్వాలంటూ ఆదివారం అర్ధరాత్రి శబరీనాథ్‌తో గొడవ పెట్టుకుని ఘర్షణకు దిగారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వారిని వారించేందుకు ప్రయత్నించగా, వారిపై దాడికి తెగబడ్డారు. కత్తి పీట, రాడ్లతో దాడి చేయడంతో శబరీనాథ్, రంగారావులకు తల పగిలి, ఎముకలు విరిగాయి. దీంతో వారిని వెంటనే ఏలూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

**టీడీపీ నేతల దుశ్చర్యలు సహించేది లేదు**

ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో టీడీపీ గూండాల దుశ్చర్యలు సహించబోమని హెచ్చరించారు. టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడికి పాల్పడి.. పైగా వారినే కొట్టారంటూ ఆస్పత్రిలో చేరి కేసులు పెట్టడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ఆసుపత్రులను తమ దుర్మార్గ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని, ఇక ఈ పరిస్థితిని కొనసాగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. ప్రజాభిమానం పెంచుకోవాలే కానీ ఇలా దాడులకు పాల్పడడం నీచమైన చర్య అన్నారు. సహనం పాటిస్తున్నామని, మేం రంగంలోకి దిగితే ఆపగలరా.. అంటూ ఎమ్మెల్యే తీవ్రంగా హెచ్చరించారు. ఆయన వెంట పెదవేగి మండల అధ్యక్షులు జానంపేట బాబు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### టీడీపీ నేతల కవ్వింపుతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

ఏలూరు టౌన్: టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఏలూరు జీజీహెచ్ వద్ద హడావుడి చేశారు. కొప్పాకలో జరిగిన సంఘటన నేపథ్యంలో బాధితులను పరామర్శించేందుకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి వచ్చారు. ఇదే సందర్భంలో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హాస్పటల్ వద్దకు వచ్చి మీడియాతో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వైఎస్సార్ సీపీ నేతలను రెచ్చగొట్టేలా మాట్లాడారు. ఇదే సమయంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు హాస్పటల్ వద్దకు రావడంతోనే టీడీపీ కార్యకర్తలు ఆయనతో కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఇరు వర్గాలు వాగ్వివాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు అప్రమత్తమై టీడీపీ నేతలు, కార్యకర్తలను హాస్పటల్ బయట ఉంచి గేట్లు వేశారు. కానీ చింతమనేని వర్గీయులు రెచ్చిపోతూ గొడవకు దిగేందుకు ముందుకు వస్తూ గేట్లను విరగొట్టేందుకు ప్రయత్నించారు. పరిస్థితి తీవ్రతరం కావడంతో ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు హాస్పిటల్ వద్దకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్, వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌తో పాటు పోలీసు సిబ్బంది హాస్పటల్ వద్ద మోహరించి ఇరువర్గాలను శాంతింప చేసి పంపారు.

## నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం



**జంగారెడ్డిగూడెం రూరల్:** ఆంజనేయ స్వామి జన్మ నక్షత్రం పురస్కరించుకుని మండలంలోని గుర్వాయి గూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామివారి క్షేత్రంలో సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. తుళ్లూరు గ్రామానికి చెందిన భక్త బృందం సభ్యులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు పర్యవేక్షించారు.

## వరకట్న వేధింపులపై కేసు నమోదు

**ఉండి:** వరకట్న వేధింపులపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి శివారు గోరింతోట ప్రాంతానికి చెందిన రామకూరి సంధ్యారాణిని ఆమె భర్త వెంకటరత్నం అదనపు కట్నం తేవాలంటూ నిత్యం వేధింపులకు గురి చేస్తుండటంతో విసిగిపోయిన ఆమె సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు.



# దూసుకొచ్చిన మృత్యువు

- వ్యాన్ ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ మృతి
- అదుపు తప్పి రోడ్డు మార్జిన్ ప్రాంతంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వ్యాన్
- పార్కింగ్‌లో ఉన్న మూడు మోటార్‌సైకిళ్లు, రెండు కార్లు, ఆటో ధ్వంసం



ఆటోను ఢీకొట్టిన ఐషర్ వ్యాన్



ఐసర్ వ్యాన్ ఢీకొట్టడంతో ధ్వంసమైన విద్యుత్ స్తంభం, కార్లు, మోటారు సైకిళ్లు



మృతి చెందిన మద్దా జీవరత్నం

**ఆకివీడు:** జాతీయ రహదారిపై స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో అతి వేగంగా వస్తున్న ఐషర్ వ్యాన్ విధ్వంసం సృష్టించింది. కైకలూరు నుంచి ఆకివీడు వైపు వస్తున్న వ్యాన్ రోడ్డు దాటుతున్న మోటార్‌సైక్లిస్ట్‌ను ఢీకొట్టి, అదుపుతప్పి రోడ్డు మార్జిన్ ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో అక్కడే పార్కింగ్‌లో ఉన్న మూడు మోటార్ సైకిళ్లు, రెండు కార్లు, ఆటోపై విద్యుత్ స్తంభం పడి ధ్వంసమయ్యాయి. అక్కడే ఉన్న మెకానిక్ షెడ్, కనకదుర్గమ్మ ఆలయ ప్రహరీ కూడా ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై రోడ్డు దాటుతున్న మండల రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు మద్దా జీవరత్నం మృతి చెందారు. సోమవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. జీవరత్నం తన కుమార్తె ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఆకివీడు సచివాలయం-4కు తీసుకు వెళ్లి ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టించుకుని జాతీయరహదారి దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న ఐషర్ వ్యాన్ మోటారు సైకిల్‌ను ఢీకొట్టి సంఘటనా స్థలం పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం తునాతునకలైంది. యాంగులర్లు విద్యుత్ తీగలకు వేలాడాయి. విద్యుత్ తీగలు తెగిపడటంతో ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఎవరూ ముందుకు వెళ్లలేదు. తీవ్రగాయాలై రక్త మడుగులో పడి ఉన్న డీలర్ జీవరత్నంను స్థానికులు ఆటోలో తరలించారు. ఆసుపత్రిలో వైద్యం అందిస్తుండగా జీవరత్నం మృతిచెందినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వ్యాన్ డ్రైవర్ కురెళ్ల వంశీ పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై బి.నాగబాబు పరిశీలించారు. మృతుడు జీవరత్నం కుమార్తె బత్తుల సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

## దేవపూడిలో చోరీపై కేసు నమోదు



దుండగులు పగలగొట్టిన బీరువా

**ముదినేపల్లి రూరల్:** మండలంలోని దేవపూడిలో చోరి జరిగిన ఘటనకు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం కేసు నమోదైంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన త్రిపిరనేని రాంప్రసాద్ అనారోగ్యంతో గత నెల 22న గుడివాడ ఆసుపత్రిలో చేరాడు. కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి గుడివాడలోనే ఉన్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తరువాత సోమవారం ఉదయం దేవపూడిలోని ఇంటికి రాగా ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలగొట్టి అందులో దాచిన నవరత్నాలు కల్గిన లాకెట్, తెల్లరాళ్ళ లాకెట్, పోగుల జత, వెండి సామాన్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ చోరీ ఎప్పుడు జరిగిందనేది తెలియలేదు. దీంతో రాంప్రసాద్ కుమారుడు ఈశ్వరరావు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై వెంకటకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జంగారెడ్డిగూడెంలో చోరీ..

### 16 కాసుల బంగారం అపహరణ



జంగారెడ్డిగూడెంలో ఓ ఇంట్లో బీరువా పగులగొట్టి చోరీ చేసిన దృశ్యం

**జంగారెడ్డిగూడెం :** జంగారెడ్డిగూడెంలోని సుబ్బంపేటలో ఓ ఇంట్లో చోరీ చేసి సుమారు 16 కాసుల బంగారం అపహరించుకుపోయారు. బాధితుడు కోదాటి రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సుబ్బంపేట లలితాదేవి గుడి పక్క 2వ వీధిలో కోదాటి రమేష్ నివాసం ఉంటున్నాడు. రమేష్ బావ గారు మృతిచెందడంతో ఈ నెల 11వ తేదీన తల్లిదండ్రులతో కలిసి సీతానగరం వెళ్లాడు. 12వ తేదీ మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి వెనుక తలుపులు, బెడ్‌రూమ్ తలుపులు పగులగొట్టి ఉండటాన్ని చూసి చోరీ జరిగినట్లు గమనించాడు. బెడ్‌రూమ్‌లో బీరువా తెరిచి బట్టలు చెల్లాచెదురుగా పడవేసి అందులో ఉన్న చంద్రహారం 5 కాసులు, చైన్ 2 కాసులు, చెవిదుద్దులు 1.5 కాసు, మ్యాటీలు 1కాసు, నెక్లెస్ 2.5 కాసులు, ఉంగరాలు, 1.75 కాసు, బ్రేస్‌లెట్ 1 కాసు, సూత్రాలు 1 కాసు.. సుమారు 16 కాసులు బంగారం , వెండి వస్తువులు, కొంత నగదు, ఒక సెల్‌ఫోన్ పోయినట్లు రమేష్ గుర్తించాడు. దీంతో సోమవారం చోరీకి సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## చెరువులో పడి ఇద్దరు చిన్నారుల మృతి



పైడిచింతపాడులో చిన్నారుల మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

**ఏలూరు రూరల్ :** ఓ చేపల చెరువు కన్నతల్లికి తీరని గర్భశోకం మిగిలిచ్చింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న బిడ్డలను మింగేసింది. వివరాల్లోకి వెళితే... సోమవారం ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడులో ఇద్దరు బాలురు చెరువులో జారి పడి మృతి చెందారు. జయమంగళ చక్రధరరావు, చంద్రలక్ష్మి కుమారులు హరినాథ్ (7), ధనకృష్ణరాజు (4) ఉదయం ఇంటి ముందు ఉన్న చెరువు గట్టుపై ఆడుకుంటున్నారు. అప్పటివరకూ కనిపెట్టుకున్న తల్లి క్షణం పాటు ఇంటి పనుల్లో నిమగ్నమయ్యింది. ఇదే సమయంలో నాలుగేళ్ల ధనకృష్ణరాజు చెరువు రేవులోకి దిగి జారిపోయాడు. దీన్ని గుర్తించిన అన్న హరినాథ్ తమ్ముడును రక్షించేందుకు ప్రయత్నించి చెరువులోకి దిగి మునిగిపోయాడు. అపాయాన్ని శంకించిన తల్లి పరుగు పరుగున బయటకు వచ్చి బిడ్డలను వెతికింది. రేవులో పిల్లల చెప్పులను గుర్తించి ప్రమాదాన్ని పసిగట్టి కేకలు వేసింది. దీంతో బంధువులు, గ్రామస్తులు పరుగున వచ్చి చెరువులో తేలియాడుతున్న పెద్ద కొడుకు హరినాథ్‌ను బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్నాడని గుర్తించి ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే కన్నుమూశాడు. మరోపక్క చిన్నోడు ధనకృష్ణరాజు కోసం వెతకగా, చెరువులోని రేకు పడవ కింద చిక్కుకుపోయి విగతజీవుడుగా కనిపించాడు. బిడ్డలు మరణవార్త తెలుసుకున్న తండ్రి హుటాహుటిన ఇంటికి వచ్చి కన్నీరు మున్నీరయ్యాడు. రెప్పపాటులో కన్నబిడ్డలు విగత జీవులు కావడాన్ని చూసి ఆ తల్లి గుండెలు బాదుకుని బావురుమంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఏలూరు రూరల్ తహసీల్దార్ నరసింహారావు, వీఆర్వో కాంతారావు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు.

## టిప్పర్ లారీని ఢీకొట్టిన వ్యాన్

### వ్యాన్ క్లీనర్ దుర్మరణం, డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



లక్ష్మీనగర్‌లో టిప్పర్ లారీని ఢీకొట్టిన వ్యాన్

**ద్వారకాతిరుమల:** మండలంలోని మారంపల్లి పంచాయతీ, లక్ష్మీనగర్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో టాటా ఏస్ వ్యాన్ క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం. అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట గ్రామానికి చెందిన సలికే రాజ్‌కుమార్ (25) క్లీనర్‌గా, అదే గ్రామానికి చెందిన సలికే రవితేజ డ్రైవర్‌గా ఒక టాటా ఏస్ వ్యాన్‌పై పనిచేస్తున్నారు. ఉదయం వారు పాయకరావుపేట నుంచి వరంగల్‌కు వ్యాన్‌పై వెళుతున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న టిప్పర్ లారీని గోపాలపురం మండలం, తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్ గొట్టుకుల సోమరాజు అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి సడన్ బ్రేక్ వేశాడు. దాంతో అదుపుతప్పిన వ్యాన్ వెనుక నుంచి లారీని వేగంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో క్లీనర్ రాజ్‌కుమార్ శరీర భాగాలు పూర్తిగా నుజ్జునుయ్యాయి. మృతదేహం గుర్తు పట్టలేనంతగా ముద్దయ్యింది. ప్రమాదానికి కారకులైన టిప్పర్ లారీ డ్రైవర్ సోమరాజు, ఆటో డ్రైవర్ రవితేజలపై మృతుడు తండ్రి సలికే నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సతీష్ తెలిపారు.

## కాంగ్రెస్ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



కృష్ణంరాజుకి వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ శ్రీధర్‌బాబు, విజయరాజు

**జంగారెడ్డిగూడెం రూరల్:** పుట్లగట్లగూడెంలో పలువురు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శీలం కృష్ణంరాజు ఆధ్వర్యంలో 80 మంది వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు వారికి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కృష్ణంరాజుతో పాటు ఉప సర్పంచ్ మద్దాల చంద్రరావు, మాజీ ఉప సర్పంచ్ వామిశెట్టి తమ్మారావు, గంగుల పవన్, పారేపల్లి దుర్గసాయి, శీలం సాయి, శీలం చిన ఆంజనేయులు, బెజవాడ స్వామి, మాజీ వార్డు సభ్యులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన నచ్చి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు శీలం కృష్ణంరాజు తెలిపారు.

## వచ్చే ఎన్నికల్లో మహిళల పాత్ర కీలకం



జంగారెడ్డిగూడెంలో జిల్లా మహిళా విభాగం ప్రధాన కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** వచ్చే ఎన్నికల్లో మహిళలు ప్రధాన భూమిక పోషించి వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించేందుకు కృషి చేయాలని ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ అన్నారు. జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాల పద్మ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఏలూరు జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలు, ఒక పార్లమెంట్ స్థానాన్ని అఖండ మెజార్టీతో గెలిపించేలా మహిళలు కృషిచేయాలన్నారు. ముఖ్యంగా మహిళా నాయకులు ప్రతి నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి మహిళలను చైతన్య పరచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యత తదితర అంశాలను క్షుణ్ణంగా తెలియజేయాలన్నారు. అలాగే మహిళా విభాగాన్ని పటిష్ట పరిచేలా కార్యాచరణ ఉండాలన్నారు. ప్రధాన కమిటీలోని 41 మంది సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరించి ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి ఓటు వేసేలా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వసంతలక్ష్మి, జనరల్ సెక్రటరీ బాల త్రిపుర సుందరీ, నిడదవోలు రాజ్యలక్ష్మి, వసంతకుమారి, సెక్రటరీలు వసంతలక్ష్మి, ధనలక్ష్మి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సాయిల స్వాతి, అన్ని నియోజకవర్గ కార్యదర్శులు, జాయింట్ కార్యదర్శులు, మెంబర్లు, ఏలూరు జిల్లాలోని 7 నియోజకవర్గాల పరిధిలోని మహిళా నాయకులు పాల్గొన్నారు.

## బాకీ తీర్చమని అడిగినందుకు..



గాయాలతో ఉన్న బంటు రత్నగిరి

**దెందులూరు:** మండలంలోని పెరుగ్గూడెం గ్రామంలో ఆదివారం రాత్రి అప్పు తీర్చమని అడిగినందుకు పోటుకత్తితో కిరాతకంగా నరికిన వైనమిది. ఈ సంఘటనకు సంబంధించి దెందులూరు ఎస్సై స్వామి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెరుగ్గూడెం గ్రామానికి చెందిన బుల్లా సత్యనారాయణకు భీమడోలు గ్రామం నాగేశ్వరరావుపేటకు చెందిన బంటు రత్నగిరి రూ. 8 వేలకు ఎండుగడ్డిని అమ్మాడు. బాకీ ఇవ్వమని అడుగుతుంటే ఇస్తానని మూడు నెలలుగా కాలం గడుపుకుంటూ వచ్చాడు. ఆదివారం రాత్రి అప్పు చెల్లించమని సత్యనారాయణ ఇంటికి రత్నగిరి వచ్చాడు. నన్ను అల్లరి చేస్తావా... అంటూ ఇంట్లో ఉన్న పోటుకత్తి తీసుకు వచ్చి రత్నగిరి మెడ, చెవి వెనుక కిరాతకంగా నరికివేశాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడు బుల్లా సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన రత్నగిరిని గ్రామస్తులు 108లో భీమడోలు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి ఏలూరు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడకు తరలించగా అక్కడ బాధితుడు చికిత్స పొందుతున్నాడు. నిందితుడిపై సోమవారం హత్యాయత్నం కేసు నమోదు చేసి భీమడోలు కోర్టుకు హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

## 14న ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

**ఏలూరు (టూటౌన్):** ఈ నెల 14వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి భీమడోలులోని గీతాంజలి ఇంటర్, డిగ్రీ కళాశాల ఆవరణలో ఉద్యోగాల భర్తీకై ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు, కళాశాల కరస్పాండెంట్ ఎం.గౌతమ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ సత్యనారాయణ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. భీమడోలు మండలం అంబరుపేటలోని లిక్సిల్ ఇండియా శానిటరీవేర్ కంపెనీలో ప్రొడక్షన్ డిపార్టుమెంట్‌లో పనిచేసేందుకు మహిళల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పాసై, 20 ఏళ్లు పైబడిన మహిళలు ఇందుకు అర్హులుగా పేర్కొన్నారు. అలాగే వెల్డర్స్, ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల్లో అప్రెంటీస్‌గా పనిచేసేందుకు 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, ఆధార్ కాపీ, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నేరుగా హాజరుకావాలని కోరారు. వివరాలకు సెల్ 88868 82032లో సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు తెలిపారు.

## తండ్రి మందలించాడని బాలుడి ఆత్మహత్య

**తణుకు:** తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన బాలుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తణుకు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. స్థానిక ఇరగవరం కాలనీకు చెందిన సేరిమందు అశోక్ (17) స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అతను సరిగ్గా చదవడం లేదని తండ్రి శ్రీనివాస్ మందలించాడు. దీంతో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విషాదం మిగిల్చిన మద్యం మత్తు



కొత్తూరి అనిల్ (ఫైల్)

**జంగారెడ్డిగూడెం:** మద్యం మత్తు ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. వివరాల్లోకి వెళితే జంగారెడ్డిగూడెం పట్టణంలోని 8 వ వార్డుకు చెందిన కొత్తూరి అనిల్ (30)కి తండ్రి మరణించగా తల్లి చిన్నతనంలోనే విడిచి పెట్టేసింది. దీంతో స్థానిక జగజ్జీవన్ నగర్‌లో ఓ గుడిసెలో ఉంటున్న అనిల్ అందరితోనూ కలివిడిగా ఉంటూ తలలో నాలుకలా ఉండేవాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి వస్తున్న అనిల్‌కు, మద్యం తాగిన ఓ మైనర్ బాలుడికి మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. ఇంతలోనే మైనర్ బాలుడు తన జేబులో ఉన్న బటన్ చాకుతో అనిల్ కడులోపులో విచక్షణా రహితంగా పొడిచి పారిపోయాడు. స్థానికులు అనిల్‌ను స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి ఏలూరు అనంతరం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. దీంతో మృతుడు అనిల్ బంధువులు జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నిందితుడుకి శిక్ష పడేలా చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. కాగా మైనర్ బాలుడు(17) తన తండ్రిని చంపడానికి జేబులో కత్తి పెట్టుకుని తిరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. బాలుడు మద్యానికి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్లనే ఇలా జరిగిందని అంటున్నారు. అర్ధరాత్రులు మద్యం సేవించి రోడ్లపై ఉండటం వల్ల పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉన్నందున పోలీసులు తగిన దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

## శివదేవునిచిక్కాలలో చోరీ

**పాలకొల్లు అర్బన్:** పట్టపగలు అగంతకుడు ఇంట్లోకి ప్రవేశించి బంగారం, నగదు దోచుకుపోయిన సంఘటన పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో ఆదివారం జరిగింది. వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్, మండల కోఆప్షన్ సభ్యుడు తండా ఇస్సాక్‌రాజు అతని భార్య, కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం చర్చికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంట్లో బీరువా తెరిచి ఉండడం చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. 5 కాసుల బంగారం, 20 వేలు నగదు చోరీకి గురయ్యాయని బాధితులు తెలిపారు. డీఎస్పీ కె.రవి మనోహరాచారి, రూరల్ సీఐ కుడుపూడి సతీష్ చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇస్సాక్‌రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై డి హరికృష్ణ తెలిపారు.

## క్లుప్తంగా

### ఘంటసాల గాన సభ సేవలు అభినందనీయం



కళాకారులను సత్కరిస్తున్న ఘంటసాల గాన సభ సభ్యులు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** ఘంటసాల గాన సభ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పద్మశ్రీ ఘంటసాల వర్ధంతి సందర్భంగా బీవీఆర్‌లో జరిగిన సభలో జిత్ మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా వ్యవస్థాపకులు, సినీ నటులు, ప్రఖ్యాత గాయకులు శ్రీపాద జిత్ మోహన్ మిత్రా (రాజమండ్రి)కి ఘంటసాల అవార్డు ప్రధానం, నాదస్వర విద్యాంసులు నాగూర్ సాహేబ్, మదీన్ బీబీ అవార్డును నర్తకులు, నటులు పీటీ వెంకన్నకు అందజేశారు. వీరి ఇరువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సాంస్కృతి నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, గానసభ అధ్యక్షుడు కాసిం, అంతర్జాతీయ శిల్పి దేవికారాణి ఉడయార్ తదితరులు పాల్గొన్నారు.

### స్పటిక లింగానికి విశేష పూజలు



శంకరమఠంలోని స్పటికలింగం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** మాఘ మాసం సందర్భంగా స్థానిక శంకరమఠంలోని వేంచేసియున్న ఉమా చంద్ర మౌళీశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మఠంలోని స్పటికలింగానికి నేరుగా సూర్యకిరణాలు తాకడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విశేష పూజల్లో పాల్గొన్నారు. ఆదిశంకరాచార్య స్వామికి, సర్వమంగళ అమ్మవారికి మహిళా భక్తులచే కుంకుమార్చనలు చేశారు.

### టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణతకు కసరత్తు

**ఆకివీడు:** పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఆయా పాఠశాలల వద్ద విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఎ.రవీంద్ర సోమవారం చెప్పారు. జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8.30 నుంచి 9.30 వరకు, సాయింత్రం స్కూల్ వదిలిన తరువాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్నామన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కొందరు విద్యార్థుల్ని దత్తత తీసుకుని విద్యాబోధన చేస్తున్నారని ఎంఈఓ వివరించారు.

### హిందూ ధర్మ ప్రచార మహోత్సవాలు



కూచిపూడి నృత్య ప్రదర్శన

**భీమవరం(ప్రకాశంచౌక్):** భీమవరం గునుపూడిలోని పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామివార్ల దేవస్థానం నందు హిందూ ధర్మ ప్రచార మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ముత్తయిదువులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మయూరి కూచిపూడి నృత్య అకాడమీ కళాకారుల నాట్య ప్రదర్శన అబ్బురపరిచింది. దేవస్థానం ధర్మకర్తలు కూర్మదాసు సత్య శ్రీనివాస్, నాచు శ్రీవల్లి, లక్కు త్రిమూర్తులు, చెల్లబోయిన సూర్య ప్రకాష్, సోమాదుల లీలా ఈశ్వరి, తాణాల రామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఈవో పర్యవేక్షించారు.

### ఆర్ కృష్ణయ్యను కలిసిన బీసీ నాయకులు



ఎంపీ ఆర్ కృష్ణయ్యను కలిసిన కోడే యుగంధర్ తదితరులు

**భీమవరం(ప్రకాశం చౌక్):** రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యను హైదరాబాద్‌లో పశ్చిమగోదావరి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోడే యుగంధర్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు ముద్దాడ గణేష్ భవాని, పాలకొల్లు, భీమవరం, యలమంచిలి అధ్యక్షులు పితాని సత్యనారాయణ, కడలి ధర్మారావు, పొన్నమండ ముత్యాలరావు కలిశారు. ఈ సందర్భంగా చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్‌లు వెంటనే అమలు చేయాలని, విద్యావ్యవస్థలో సేవలు పెంపుపై పార్లమెంట్ సమావేశంలో ప్రస్తావించాలని ఆయనను కోరినట్లు కోడే యుగంధర్ తెలిపారు.

# ధీమాగా ఉంటే బీమా రాదు!

- ముద్ర పడకపోతే పరిహారం లేదు
- ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి
- గ్రామాల్లో అధికారుల ప్రచారం



పెంటపాడులో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

**పెంటపాడు:** రైతుల పరిభాషలో చెప్పాలంటే ప్రభుత్వం పాయ్యకాడ ఆకుమడిలా అన్ని వసతులు వారి కాళ్ల దగ్గరకే తెచ్చి పెడుతోంది. కాని కొందరు రైతులు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవడంలో అలసత్వం వహిస్తున్నారు. తీరా నష్టం జరిగాక పరిహారం రాలేందంటూ ఆవేదన చెందుతున్నారు. అధికారుల విన్నపాలను పట్టించుకుని సహకరిస్తే రైతులకు మేలు జరుగుతుంది. ఈ ఏడాది ఈ–క్రాప్ నమమోదు ప్రారంభమవ్వడంతో రైతులను సమాయత్తం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. అన్నం పెట్టే రైతన్నకు పూర్తిస్థాయిలో సేవలందించేందుకు కృషి చేస్తోంది. ఆదిశగా క్షేత్ర స్థాయిలో అడుగులు పడుతున్నాయి. రైతు సంక్షేమమే ధ్యేయమంటూ అంటు ప్రసంగాలు గుప్పించి సమావేశాలు పెట్టి చేతులు దులుపుకునే గత పాలకులుకు భిన్నంగా ప్రతి రైతుకు సేవా సదుపాయాలు అందే దిశగా ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ–క్రాప్ నమోదు ప్రక్రియతో వ్యవసాయ అనుబంధ శాఖ సేవలన్ని రైతుకు ఏ ఇబ్బంది లేకుండా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

**విస్తృత ప్రచారం**

రైతు భరోసా కేంద్రంలో ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న రైతుకు సంబంధించిన పంటలు ప్రకృతి వైపరిత్యాల వల్ల నష్టాల పాలైతే ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండానే రైతుకు నష్టపరిహారం అందెలా ఆయా రైతుల పేరున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించనుంది. రైతులకు సూచనలు సలహాలు అందించడానికి నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమంలో అధికారులు ఈ–క్రాప్‌పై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. నియోజకవర్గంలో ఏ రైతు ఇతర గ్రామాలు వెళ్లనక్కరలేదు. తమ గ్రామంలోనే ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ చేయించుకుంటే సరిపోతుంది. పంట సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని అధికారులు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పొలాల్లోకి వెళ్లి మరీ రైతులకు వివరిస్తున్నారు.

### ఈ-క్రాప్ నమోదుకు 15 వరకే గడువు



అన్ని మండలాల్లోనూ ఈ-క్రాప్ నమోదు ప్రారంభించాం. ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉంది. అందరూ తమ పొలాలు, పంటల వివరాలను సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి నమోదు చేయించుకోవాలి. రైతులు ఆధార్ కారుడ, బ్యాంకు అకౌంటు బుక్, సీసీ ఆర్టీ కార్డు తీసుకువెళ్లాలి. ఇప్పటికే వ్యవసాయ శాఖ సిబ్బంది ఆయా గ్రామాల పరిధిలో ఈ-క్రాప్ నమోదుపై రైతులకు సమాచారం అందరిని సిద్ధం చేస్తున్నారు. పంటల బీమా రావాలన్న, ప్రభుత్వ పథకాలు సబ్సిడీలు రావాలన్నా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి. వరితో పాటు మొక్కజొన్న, ప్రత్తి, మల్బరీ, ఆపరాలు, మామిడి, జీడిమామిడి ఇలా ఏపంటైనా సరే ఈ-క్రాప్ చేయించుకోవాల్సిందే.

– పి. మురళీకృష్ణ, ఏడీఏ తాడేపల్లిగూడెం

### త్రైతసిద్ధాంత భగవద్గీత విశిష్టతను తెలుసుకోవాలి



పాందువ్వలో ప్రచారం నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

**ఉండి:** ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైతసిద్ధాంత భగవద్గీత విశిష్టతను భక్తులు తప్పకుండా తెలుసుకోవాలని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక భీమవరం అధ్యక్షుడు ఉదయ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పాందువ్వలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై బృందం సభ్యులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు నాగేశ్వరరావు, వాసుదేవ, చక్రధర్‌రావు, తారకేశ్వరి, సుజాత, సత్యనారాయణ, రాము, లోకేష్, శ్రీకర్, చైతన్య, లక్ష్మీ, రేఖ, యశోధ, దుర్గాభవాని, భానుమతి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కారుమూరి పరామర్శలు



అత్తిలిలో దామోదరం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి



మండపాకలో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తున్న మంత్రి కారుమూరి

**అత్తిలి:** అత్తిలి శివారు బొంతువారిపాలెంకు చెందిన శీలబోయిన దామోదరం ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో సోమవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దామోదరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. మంత్రి కారుమూరి వెంట వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు రంభ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెచ్చెట్టి రామకృష్ణ, కంకటాల సతీష్, బొంతు దానయ్య, బొంతు ఆంజనేయులు, అప్పన్న తదితరులు ఉన్నారు.

**తణుకు టౌన్:** తణుకు మండలం మండపాక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీ విభాగం గృహ సారథి కొండపల్లి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆకుటుంబ సభ్యులను రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ కొండపల్లి శ్రీనివాస్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, సొసైటీ అధ్యక్షురాలు వై విజయామూర్తి, ఎంపీటీసీ కాళ్ల సన్యాసిరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేత



తణుకులో విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

**తణుకు టౌన్:** తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో తణుకు మహిళా కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినికి కళాశాల ఫీజు నిమిత్తం రూ. 12,500 ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆసంస్థ అధ్యక్షుడు అక్కాపంతుల బాలాజీ తెలిపారు. సోమవారం తణుకు రోటరీ క్లబ్‌లో మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తణుకుకు చెందిన శ్రీకరి డయోగ్నస్టిక్స్ డాక్టర్ బోగవల్లి వెంకట్రావు మానవత సంస్థకు రూ. 10 వేలు విరాళం అందజేయగా వాటితో పాటు మానవత సంస్థ మరో రూ. 2,500 కలిపి ఇంటర్ విద్యార్థిని యడ్ల తేజశ్రీకి తన కళాశాల ఫీజుల నిమిత్తం అందజేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి ఆలపాటి సోమేశ్వరరావు, అక్కిన కాశీ, పులమాల భద్రం, ఏ సుబ్రహ్మణ్యం, బీ రామకాశి, కే రాజ రాజేశ్వరరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పుంత రోడ్లకు బడ్జెట్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

**తాడేపల్లిగూడెం రూరల్:** మార్కెట్ కమిటి పరిధిలోని గ్రామాల్లో పుంత రోడ్ల నిర్మాణానికి బడ్జెట్ ఆమోదం లభించిందని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని పడాల మార్కెట్ యార్డులో ఏఎంసీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్ మాట్లాడారు. సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, ఏఎంసీ గ్రేడ్–1 కార్యదర్శి ఎంఎస్‌వీ.ప్రభాకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కై కాల శ్రీనివాస్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి పెద్దబ్బులురెడ్డి, మార్కెట్ కమిటి వైస్‌చైర్మన్ చోడగిరి చినబాబు, వ్యవసాయ కమిటి డైరెక్టర్లు కర్రి వరహాలరెడ్డి, గారపాటి వీరకుమార్, బురడా శ్రీను, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత అవసరం



పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

**తణుకు టౌన్:** ప్రతి విద్యార్థి తన చదువు పట్ల ఏకాగ్రతను పాటించి ఉత్తమ మార్కులు సాధించాలని మండల విద్యాశాఖాధికారి డీ మురళీ సత్యనారాయణ చెప్పారు. సోమవారం తణుకు మండలంలోని మండపాక పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం నిర్వహించిన స్ఫూర్తి (మోటివేషన్) కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల గృహాలను సందర్శించాలన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి చదివించాలని కోరారు. పదో తరగతి విద్యార్థులకు నాలుగు సార్లు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం ఏడుకొండలు, కేవీవీఎంస్ మూర్తి, పేరెంట్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ సమావేశంలో వార్డు సభ్యుల నిరసన

**పెంటపాడు:** కొండేపాడులో సోమవారం పంచాయతీ బోర్డు సమావేశం నిర్వహించారు. గ్రామ వార్డు సభ్యులు సర్పంచ్ తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. పలు తీర్మానాలు ప్రవేశపెట్టడంతో వార్డు సభ్యులు నిరసన తెలిపి సమావేశాన్ని బహిష్కరించారు. పంచాయతీలో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు చేశామని దానిపై విచారణ చేసిన అనంతరం బోర్డు సమావేశంలో పాల్గొంటామన్నారు. గ్రామాభివృద్ధిపై, తీర్మానాలపై వార్డు సభ్యుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని వారు కోరారు. వార్డు సభ్యులు పంపన రాంబాబు, ముప్పిడి శివతో పాటు, ఎంపీటీసీ సభ్యులు దేవరశెట్టి సత్యనారాయణ తదితరులు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శి శ్రీరంగను వివరణ కోరగా వార్డు సభ్యులు సర్పంచ్‌పై డీపీవోకు ఫిర్యాదు చేసిన మాట వాస్తమన్నారు. ఈ విషయంపై త్వరలో విచారణ జరుగుతుందన్నారు.

## అపురూపమైన సాహితీ ప్రక్రియ అష్టావధానం



విద్యార్థి యర్రంశెట్టి ఉమా మహేశ్వరరావును సత్కరిస్తున్న బీవీఆర్ కళాకేంద్రం సభ్యులు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** మేథస్సుతో కూడిన అపురూపమైన సాహితీ ప్రక్రియ అష్టావధానమని బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు అన్నారు. పట్టణంలోని శిరిడి సాయి స్కూల్‌లో తెలుగు సాహితీ సమాఖ్య సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థి యర్రంశెట్టి ఉమా మహేశ్వరరావుచే భగవద్గీత అష్టావధాన కార్యక్రమం అలరించింది. వక్తలు మాట్లాడుతూ ఎన్నో అవధానాలు ఉన్నప్పటికి భగవద్గీత అష్టావధానం ఎంతో గొప్పదని తెలిపారు. ఈ సందర్భంగా యర్రంశెట్టి ఉమా మహేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు మండా బ్రహ్మాజీ, జంగా శ్రీనివాస్ రామ్ రాయ్, మండవల్లి చెన్నా నాగేంద్ర, గరికిపాటి బాపయ్య శర్మ, సూరంపూడి వెంకట రమణ, పి.రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి పైలు శ్రీనివాసరావు, కోపల్లె శ్రీనివాసరావు, మాడభూషి జ్యోతి కుమారి, ఈదుపల్లి మాధవి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీలో బీసీలకు ప్రాధాన్యం



భీమవరంలో ఉమాబాలకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

**భీమవరం:** వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా గతంలో ఎన్నడూ లేనివిధంగా బీసీ మహిళ గూడూరి ఉమబాలకు అవకాశం కల్పించడం అభినందనీయమని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సెల్ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ అన్నారు. సోమవారం భీమవరంలో ఉమాబాలను కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాలకృష్ణ, పార్టీ వీవర్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బల్ల పరమేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవుల కేటాయింపులో పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. ఉమాబాలకు సముచిత స్థానం కల్పించడమే కాక ఏలూరు, రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానాల్లో కూడా బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం విశేషమన్నారు. ఇప్పటి వరకు బీసీలను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మోసం చేయడమే కాక మరోసారి మోసగించటానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు టీడీపీకి తగిన గుణపాఠం చెప్పాలని బాలకృష్ణ, పరమేశ్వరరావు పిలుపునిచ్చారు.

### మట్టి ట్రాక్టర్‌లతో ప్రజల బెంబేలు



పెదలంకలో వెనుక దోర్ వేయకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

**నరసాపురం రూరల్:** పంట చేలు, ఆక్వా చెరువుల మట్టిని తరలించే ట్రాక్టర్లు మితి మీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు, ప్రయాణీకులు బెంబేలెత్తుతున్నారు. ట్రాక్టర్‌లకు వెనుకవైపున ఉండే డోర్ మూయకుపోవడంతో రోడ్లపై మట్టి గడ్డలు పడి ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అనుమతుల్లేకుండా, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా మట్టి రవాణా చేస్తుండడంతో రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కేంద్రం విధానాలతో రైతులకు తీవ్ర నష్టం

**భీమవరం:** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతులు, కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు రెండో రోజు సోమవారం క్లాత్ మర్చంట్స్ భవనంలో జరిగాయి. ఈ సందర్భంగా సుబ్బారావు, కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ దేశంలో బీజేపీ దివాళాకోరు విధానాలతో రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, పంటలకు గిట్టుబాటు ధరలు, కార్మికులకు కనీస వేతనాలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ధనాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతూ ప్రజలపై విపరీతమైన ధరల భారాన్ని మోపుతున్నారన్నారు. ఈనెల 16న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టే గ్రామీణ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ప్రజలంతా వ్యతిరేకించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, కార్యదర్శి వర్గ సభ్యులు టి.గోపాల్, పి.రంగారావు, సీహెచ్ సైదులు, ఎం.రామాంజనేయులు పాల్గొన్నారు.

## శివాలయంలో పండుగ పనులకు నాంది



పూజలు చేస్తున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

**ఉండి:** ఉండి రాజులపేటలో వేంచేసి యున్న పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి, స్వయం భూ మహిషాసుర మర్ధిని అమ్మవారి ఆలయంలో పలు కార్యక్రమాలను పురస్కరించుకుని సోమవారం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు చేతుల మీదుగా పనులకు నాంది పలికారు. అర్చకుడు సన్నిధిరాజు చలపతి ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరిరాట వేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి ఆలయంలో ఉన్న సరస్వతి అమ్మవారి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 24న ఆలయంలో నూతనంగా నిర్మించిన గీతా మందిర్ ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వచ్చేనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే శివ రాత్రి ఉత్సవాలకు పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు సన్నిధిరాజు కృష్ణ, శేషగిరి, టి.కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

### కాలనీ వాసుల వంతెన కల నెరవేరింది



గోస్తనీనదిపై నిర్మించిన మల్లిపూడి వంతెన

**పెనుమంట్ర:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు చొరవతో పెనుమంట్ర మండలం మల్లిపూడి ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీ వాసుల రహదారి సమస్యకు మోక్షం లభించింది. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో నాటి అత్తిలి ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం నిమిత్తం మల్లిపూడి గ్రామంలో రామేశ్వరం, జుత్తిగ మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న గోస్తనీ ఆవతల గట్టున నాలుగున్నర ఎకరాల స్థలం సేకరించి, మల్లిపూడి గ్రామ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ స్థలాలకు వెళ్లాలంటే మల్లిపూడిలోని వేణుగోపాలస్వామి గుడి నుంచి సత్తా రామలింగేశ్వరస్వామి గుడికి వెళ్లే పుంత రహదారి నుంచి సుమారు కిలో మీటరు ప్రయాణించాలి. దీంతో అప్పట్లో జుత్తిగ వద్ద గోస్తనీనదిపై వంతెన నిర్మిస్తానని శ్రీరంగనాథరాజు కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. అయితే అనంతరం వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ వంతెన సమస్యను పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ హయాంలో ఆచంట ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రీరంగనాథరాజు ఇదే కాలనీలో మరో ఎకరం 20 సెంట్ల స్థలం కొనుగోలు చేసి జగనన్న లబ్ధిదారులు 40 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. దీంతో ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో 180 మంది వరకు పట్టాలు ఇవ్వగా, సుమారు 150 మంది గృహాలు నిర్మించుకున్నారు.

### డీఎన్నార్ కళాశాలలో అదనపు కోర్సులు

**పాలకొల్లు సెంట్రల్:** కళాశాలలో సాధారణ విద్యతోపాటు అదనపు కోర్సులు బోధించనున్నట్టు ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. సోమవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అదనపు కోర్సులపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సులో శోభారాణి మాట్లాడుతూ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్, రాజనీతి శాస్త్రం, తెలుగు శాఖలో వరుసగా కరాటే, గాంధీ ఎస్ స్టడీస్, తెలుగు జర్నలిజంలో సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించామని తెలిపారు. డిగ్రీ ఫైనల్ ఇటర్ విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరాటే ఇన్‌స్ట్రక్టర్ ధనాని సూర్య ప్రకాష్ శిక్షణ ఇస్తారని చెప్పారు.